క్లుప్తంగా

బండలాగుడు పోటీల విజేత గాజులపేట వృషభాలు



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

తుగ్గలి : మౌలాలా స్వామి ఉరుసు సందర్భంగా బుధవారం ఉప్పర్లపల్లిలో నిర్వహించిన ఎద్ల బండలాగుడు పోటీల్లో 7,014 అడుగులు లాగి గాజులపేట రమణయ్య వృషభాలు విజేతగా నిలిచాయి. పోటీలను సర్పంచ్ ప్రభాకరరెడ్డి ప్రారంభించారు. తర్వాతి స్థానాల్లో చాబాల కుల్లాయప్ప వృషభాలు, ఉద్దేనహాల్ ఉద్యాల బసన్న, పులికొండ రంగస్వామినాయుడు, మల్లేనిపల్లి విజయకుమార్ ఎద్దులు నిలవడంతె వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేల నగదు బహుమతులు అందజేశారు. నాయకులు సురేంద్రనాథరెడ్డి, రామాంజి, బీమానాయక్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత గుంటుపల్లె

వెల్దుర్తి(కృష్ణగిరి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా నర్సాపురం గ్రామంలో సర్పంచ్ శీల ఈరమ్మ, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన 10 ఓవర్ల టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో వెల్దుర్తి మండలంలోని గుంటుపల్లె జట్టు విజేతగా నిలిచింది. బుధవారం నాటి ఫైనల్‌లో నర్సాపురం, గుంటుపల్లె జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుంటుపల్లె జట్టు నిర్ణీత ఓవర్లలో 84 పరుగులు చేయగా, నర్సాపురం జట్టు 64 పరుగులకు ఆలౌటైంది. బహుమతి ప్రదాన కార్యక్రమంలో విజేత జట్టుకు రూ.15వేలు, రన్నర్స్ జట్టుకు రూ.10వేలు,ట్రోఫీలను వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు, కృష్ణారెడ్డి అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): చెరుకులపాడు క్రాస్ రోడ్డు వద్ద హైవే 44పై మంగళవారం రాత్రి బైక్ అదుపుతప్పి వెల్దుర్తి మండలం, కలుగొట్ల గ్రామానికి చెందిన మహమ్మద్ రఫి గాయపడ్డాడు. డోన్‌లో నివాసముంటున్న రఫి కర్నూలు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పథకాలను వినియోగించుకోండి

తుగ్గలి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలు వినియోగించుకోవాలని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కోఆర్డినేటర్ సత్తార్ తెలిపారు. బుధవారం స్థానిక సచివాలయంలో వికసిత్ భారత్‌సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రవి, ఎంపీటీసీ సభ్యుడు రాజు, పంచాయతీ కార్యదర్శి రాజునాయక్, వెల్ఫేర్ అసిస్టెంట్ పులిశేఖర్ పాల్గొన్నారు.

హొళగుంద: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, బీజేపీ నాయకులు కోరారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చలువాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరి రాజశేఖర్ అధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ సుహాసిని, డాక్టర్ బింధుమాధవి, ఏఓ ఆనంద్ లోకదళ్, ఐసీడీఎస్ సుపర్‌వైజర్ షీబారాణి, ఎస్‌బీఐ మేనేజర్ సతీష్, బీజేపీ నాయకులు వెంకటరాముడు, చిదానంద, ప్రసాద్, జక్కనాచారి, సుధా పాల్గొన్నారు.

హాలహర్వి: చింతకుంట గ్రామంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని బుధవారం మండల ప్రత్యేకాధికారి రామాంజనేయులు, ఎంపీడీఓ ఆంథోని ఆధ్వర్యంలో నిర్వహించారు. తహసీల్దార్ మల్లికార్జున, బీజేపీ మండల అధ్యక్షులు బసవరాజు, చింతకుంట సర్పంచ్ సద్దాంహుసేన్, వైస్ ఎంపీపీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ



ఆర్టీసీ డీఎం అమర్నాథ్

ఎమ్మిగనూరుటౌన్: ఆర్టీసీ డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్ పేర్కొన్నారు.రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక డిపోలో డ్రైవర్లు,కార్మికులతో ప్రమాదాల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు. డిపో సీఐ నాగరాజు, ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్‌బాబు,ఎల్‌హెచ్ గంగన్న, కార్యాలయ సూపరింటెండెంట్ పంపాపతి, కార్మిక సంఘాల నాయకులు రఫీక్ అహమ్మద్, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు





నియోజకవర్గ స్థాయికి ఎంపికైన కబడ్డీ క్రీడాకారులకు మెమొంటో అందిస్తున్న దృశ్యం, హొళగుందలో క్రీడాకారులతో అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

వెల్దుర్తి(కృష్ణగిరి): ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. స్థానిక బాలుర హైస్కూల్ మైదానంలో బుధవారం జరిగిన కబడ్డీ ఫైనల్ పోటీలో గోవర్ధనగిరి జట్టుతో తలపడిన వెల్దుర్తి-2 జట్టు 34-16 తేడాతో విజేతగా నిలిచింది. వాలీబాల్ ఫైనల్ పోటీలో వెల్దుర్తి-2, వెల్దుర్తి-3 సచివాలయాల మధ్య జరిగిన హోరాహోరీ పోరులో వెల్దుర్తి-2 విజయం సాధించింది. బ్యాడ్మింటన్ (డబుల్స్) విభాగంలో వెల్దుర్తి-1తో జరిగిన ఫైనల్ పోరులో చెరుకులపాడు జట్టు గెలుపొందింది. విజేతలను నియోజకవర్గస్థాయికి ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ శ్రీనవాసరావు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి వెంకట్ నాయుడు విజేతలకు బహుమతులందజేశాడు. పీడీలు నిర్మల, కేథరిన్, నరసింహులు, మాలిక్, రసూల్‌బీ, షబానా, మునెమ్మ, మాధవి పాల్గొన్నారు. క్రికెట్‌తోపాటు బాలికల ఖోఖో, షటిల్, కబడ్డీ పోటీలు గురువారం జరుగనున్నాయి.

కృష్ణగిరి: క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తుందని ఎంపీడీఓ రామస్వామి తెలిపారు. మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర నాల్గవ రోజు క్రీడా పోటీలను బుధవారం నిర్వహించారు. క్రికెట్ పోటీల్లో 14 జట్లు పాల్గొనగా విన్నర్‌గా కోయిలకొండ జట్టు, రన్నర్‌గా ఆలంకొండ జట్టు నిలిచాయి. గెలుపొందిన జట్టు నియోజకవర్గస్థాయిలో ఆడనుంది.

హొళగుంద: స్థానిక, ఇంగళదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మండల స్థాయి క్రికెట్ పోటీలు ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగాయి. హొళగుందలో ఎంపీడీఓ సుభాషిణి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్ తదితరులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, పంపాపతి, హనుమప్ప, మల్లయ్య, ఎంపీటీసీ మల్లికార్జున తదితరులు పోటీలను ప్రారంభించారు. హొళగుందలో జరిగిన పోటీల్లో హొళగుంద-4 జట్టు, ఇంగళదహాళ్‌లో హెబ్బటం జట్టు విజయం సాధించాయి. హెబ్బటం ప్లేయర్ పీరా 32 బంతుల్లో 58 పరుగులు చేశాడు.



క్రికెట్‌లో గెలుపొందిన కోయిలకొండ జట్టుతో అధికారులు



నందవరంలో గెలుపొందిన జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

నందవరం : ఆడుదాం ఆంధ్ర క్రీడ పోటీలు గ్రామీణ క్రీడకారులకు మంచి గుర్తింపు లభిస్తుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, సర్పంచ్ విరుపాక్షిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఎంపీడీఓ దశరథ రామయ్య, తహసీల్దార్ నిత్యానందరాజు, ఎస్‌ఐ తిమ్మయ్య చేతుల మీదుగా ప్రజా ప్రతినిధులు గెలుపొందిన జట్టుకు ట్రోఫీని అందజేశారు. ముగతి-1, ముగతి-2 జట్లు హోరాహోరీగా తలబడి ఫైనల్‌కు చేరుకున్నాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన ముగతి-2 జట్టు నిర్ణీత 4 ఓవర్లలో 37 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ముగతి-1 జట్టు 38 పరుగులు చేసి గెలుపొందింది. ఈ జట్టు నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొననుంది.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

గోనెగండ్ల: గ్రామాల అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్‌లకు రెండురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈఓఆర్డీ నాగేష్‌తో కలిసి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ఏయే పనులు చేయాలి ఇందుకు నిధులు ఎలా సమీకరించాలి అనే విషయాలను వివరించారు. స్వయం అభివృద్ధి కోసం గ్రామంలో ఉన్న ఆదాయ వనరులపై దృష్టి సారించి వాటి ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని చెప్పారు. సర్పంచ్, కార్యదర్శి, వార్డు సభ్యుల బాధ్యతలను వివరించారు. పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్, వెంకటేశ్వర్లు, సతీష్, సోమేష్, నరేంద్ర, నరసమ్మ, సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్

హాలహర్వి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, మండల బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ అంథోనీ, ఈఓపీఆర్‌డీ మల్లికార్జున, ఏపీఎం శివయ్య, ఏపీఓ హేమసుందర్, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామాల అభివృద్ధికి కేటాయించాల్సిన నిధులు, మౌలిక వసతులపై చర్చించారు.

గ్రామాల సంపూర్ణ అభివృద్ధే లక్ష్యం

తుగ్గలి : గ్రామాల సంపూర్ణ అభివృద్ధే ప్రభుత్వాల లక్ష్యమని ఎంపీడీఓ సావిత్రి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీల ఆదాయంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదలయ్యే నిధుల వినియోగం, చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. జీపీడీపీ ప్రణాళిక తయారీపై రీసోర్స్ పర్సన్ శివకుమార్ శిక్షణ ఇచ్చారు.

చిప్పగిరి: మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధిపై రెండు రోజుల పాటు నిర్వహించే పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024-2025 శిక్షణ కార్యక్రమం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రారంభమైంది. అభివృద్ధి పనులు, నిధులు తదితర అంశాలపై ఆయా గ్రామాల సర్పంచులు, సచివాలయ సిబ్బంది,పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ సీవీ కొండయ్య అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ బాలన్న, పంచాయతీ కార్యదర్శులు నారాయణ స్వామి, సిసింద్రీ,నరేంద్ర,జయరాం నాయక్,సురేంద్ర,నరసింహులు,సుదీర్,రామాంజినేయులు,ప్రమీల పాల్గొన్నారు.

నందవరం : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ దశరథరామయ్య సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, పారిశుద్ధ్యం తదితర వాటిపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఆదాయ వనరులను సృష్టించుకునేలా ఈ నెల 24లోపు ప్రణాళికలు తయారు చేయాలని చెప్పారు. ఈ నెల 27 నుంచి 28 తేదీ వరకు పరిశీలన, 31వ తేదీన ప్రణాళికల ఆమోదం ఉంటుందని, ప్రణాళికల్లో ప్రతి ఒక్కరూ భాగ్యసామ్యం కావాలన్నారు. సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, పీఆర్‌ఏఈ జయన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్దికెర : మండలంలోని గ్రామాలను ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తామని ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ అనే పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ మురళీశధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ మహేశ్వరరెడ్డి, సర్పంచులు సుహాసిని, విజయుడు, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఈఓలు సుధాకర్, సంజప్ప, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహమూర్తి

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

నందవరం : హాలహర్వి గ్రామంలో జగనన్న కాలనీ లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు బోయ ఉరుకుందమ్మ, బోయ ధనలక్ష్మీ కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదట స్థలం కేటాయించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ.. హాలహర్వి గ్రామంలో నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా సర్వే నంబర్ 407లోని లేఅవుట్ - 1లో 15 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి, జీయో ట్యాగ్ చేశారన్నారు. అయితే తమకు కేటాయించిన స్థలాలను కొందరు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. లబ్ధిదారులు దస్తగిరి, రవి, కిష్టన్న, నాగవేణి, గోపాల్, రాఘవేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

వెల్దుర్తి(కృష్ణగిరి): కృష్ణగిరి మండలం తొగర్చేడు ప్రాథమికోన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు, వెల్దుర్తికి చెందిన ఎస్వీ శేషారెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. పార్టీ వెల్దుర్తి మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి ఉన్నారు.

డ్రోన్ వినియోగంపై అవగాహన

హాలహర్వి: డ్రోన్ ద్వారా పంటలకు మందులు ఎలా పిచికారి చేయాలనే అంశంపై ఏఓ శివశంకర్ బుధవారం మండలంలోని చింతకుంట రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డ్రోన్ ద్వారా గంటకు 20 ఎకరాల్లోని పంటకు మందు పిచికారీ చేయవచ్చన్నారు. డ్రోన్ విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.10 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం సబ్సిడీ ద్వారా రూ.6 లక్షలకే ఇస్తుందని చెప్పారు. ఐదుగురు గ్రూపుగా మారి డ్రోన్‌ను కొనుగోలు చేయవచ్చన్నారు. మండల ప్రత్యేకాధికారి రామాంజనేయులు, ఎంపీడీఓ ఆంథోనీ, తహసీల్దార్ మల్లికార్జున, సర్పంచ్ సద్దాం హుసేన్ పాల్గొన్నారు.

థియేటర్లపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో నిబంధనలు పాటించని థియేటర్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు ఖాజ,కృష్ణ కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు.

భగవద్గీతపై విస్తృత ప్రచారం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బుధవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందువాసి జ్ఞానవేదిక కల్లూరు కమిటీ అధ్యక్షుడు పురుషోత్తం ఆధ్వర్యంలో భగవద్గీతపై విస్తృత ప్రచారం చేపట్టారు. భగవద్గీత సారాంశం, ఉత్తరాయణం, బోగి,సంక్రాంతి పండుగల విశిష్టతను వివరించారు కమిటీ సభ్యులు హర్ష, అనిల్, గంగాధర్, శివ,మద్దిలేటి, బొజ్జన్న, ఓబులేసు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

దేవనకొండ: మండలంలోని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం మండలంలోని తెర్నెకల్ గ్రామంలో ప్రజలతో మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా కలిసిమెలసి జీవించాలని సూచించారు. సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం పోలీసు చట్టాలపై అవగాహన కల్పించారు.

పత్తికొండ ఏపీఎంగా మధుబాబు

పత్తికొండ రూరల్ : వైఎస్సార్ క్రాంతి పథకం మండల కో-ఆర్డినేటర్‌గా కంటవీన మధుబాబును నియమిస్తూ డీఆర్‌డీఏ ప్రాజెక్టు ఆఫీసర్ సలీంబాషా ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పత్తికొండ క్లస్టర్ కో ఆర్డినేటర్‌గా ఉన్న సర్వేష్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. పొదుపు రుణాలు పెండింగ్ బకాయిలు ఎక్కువగా ఉన్న కారణంగా ఆయనను సాధారణ విధుల్లోకి పంపించి మద్దికెర ఏపీఎంగా పనిచేస్తున్న మధుబాబుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. బుధవారం విధుల్లో చేరిన ఆయన మాట్లాడుతూ రుణాలు సకాలంలో రికవరీ చేయించి సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

శాంతిభద్రతలను కాపాడాలి

దేవనకొండ: శాంతిభద్రతలకు విఘాతం లేకుండా చూడాలని జెడ్పీటీసీ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు నూతన సీఐ శ్రీనివాసులను కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో కొత్తగా వచ్చిన సీఐ శ్రీనివాసులను మర్యాపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ దేవనకొండ పోలీస్‌స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసి సీఐను నియమించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ మల్లికార్జున, నాయకులు నిజాల్‌రెడ్డి, అలారుదిన్నె ప్రభాకర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, నారాయణరెడ్డి, ప్రేమనాథ్‌రెడ్డి, లుముంబా, రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

కృష్ణగిరి: గ్రామాల్లో కూలీలు వలసలు వెళ్లకుండా ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని ఇన్‌చార్జ్ ఏపీఓ శేషిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వలసలు ప్రారంభమయ్యావని, పనులు కల్పించి నివారించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పొలాల్లో పనులు ఉన్నందువల్ల ప్రత్యామ్నాయ పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఉండే ప్రతి కూలీ పనికి వచ్చేలా చూడాలన్నారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సీనియర్ మేటీలు పాల్గొన్నారు.

ఘర్షణలకు దూరంగా ఉండాలి

ఆస్పరి: పల్లెల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని, గొడవలు, ఘర్షణలకు దూరంగా ఉండాలని ఆస్పరి సీఐ హనుమంతప్ప సూచించారు. బుధవారం మండలంలోని ములుగుందం, బిల్లేకల్లు, ముత్తుకూరు, కైరుప్పల, యాటకల్లు గ్రామాల్లో పర్యటిస్తూ పలు విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ఫ్యాక్షన్ గొడవల వల్ల పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారడమే కాకుండా, కటుంబాలు చిన్నాభిన్నమవుతాయని, దీంతో మానసిక ప్రశాంతత లోపిస్తుందని చెప్పారు. పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థితికి తేవాలని కోరారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు స్పందించి సమాచారం పంచుకోవద్దని తెలిపారు. మహిళల పట్ల గౌరవంగా మెలగాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ములుగుందం వాసులతో మాట్లాడుతున్న ఆస్పరి సీఐ హనుమంతప్ప

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆస్పరి: ఈనెల 19వ తేదీన 206 అడుగుల రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఎత్తుగల విగ్రహాన్ని విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న దృష్ట్యా జనం పెద్ద ఎత్తున తరలి రావాలని జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుడిసె మహానంది, మసాల ప్రకాష్, వీరభద్రి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా సుమారు రూ.400 కోట్ల వ్యయంతో విజయవాడ నడిబొడ్డున స్వరాజ్య మైదానంలో నిర్మించిన అంబేడ్కర్ స్మృతివనం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. విగ్రహావిష్కరణకు ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావాలని కోరారు.నాయకులు బిణిగేరి సర్పంచ్ వెంకటేష్, పాండు, తిమ్మప్ప, సుదర్శన్, యల్లప్ప, తిప్పన్న, నరసన్న, గఫూర్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో విరుపాక్షి

వైఎస్సార్‌సీపీలో చేరిక

చిప్పగిరి: హాలహర్వి మండలం గూళ్యం,ఆలూరు మండలం అరికెర,తండా తదితర గ్రామాలకు చెందిన తెలుగుదేశం,జనసేన పార్టీలకు చెందిన 30 కుటుంబాలు బుధవారం ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినే విరుపాక్షి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన చూసి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. మునిస్వామి, ముక్కా, పండు, తులసీ, దను తుకారాం, నాయక్ , గజ్జెల్లి వెంకటేష్,ఉలిగేష్,రుద్రప్ప,మహమ్మద్,రంగయ్య,కాదయ్య పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యతనిచ్చిన ఘనత జగనన్నదే



మాట్లాడుతున్న మాచాని వెంకటేష్

ఎమ్మిగనూరుటౌన్: బీసీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మాచాని వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కురి దైవాచార సంఘ కార్యాలయంలో సంఘ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘ ఉపాధ్యక్షుడు కరె శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు కామర్తి నాగేషప్ప, సభ్యులు పాల్గొన్నారు.

దాడులను అరికట్టాలి

హొళగుంద: దళితులపై దాడులను అరికట్టాలని మహనాడు సంఘం జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మను మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. సంఘం జిల్లా కార్యదర్శి హెబ్బటం వన్నూరప్ప, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కురుకుంద గోపాల్, యూత్ ప్రెసిడెంట్ వెంకటరాముడు, ఆది, కేశవ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరురూరల్: రైతుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షులు బిఎస్. ఈరన్న కోరారు.బుధవారం స్థానిక గీతామందిరంలోని పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేశారు. మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కే.నీలకంఠ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గురు రాఘవేంద్ర, వేదావతి, గుండ్రేవుల ప్రాజెక్టలను సత్వరమే పూర్తి చేయాలని కోరారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

కృష్ణగిరి: మండలంలోని అమకతాడు గ్రామానికి చెందిన గంపనెత్తి వెంకటేశ్వర్లుపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి అదే గ్రామానికి చెందిన గంపనెత్తి మధుకుమార్ ఇంటి ముందు రోడ్డుపై ఉన్న సమయంలో వెంకటేశ్వర్లు బైక్‌పై అతివేగంగా రావంతో పిల్లలు తిరుగుతుంటారని, నెమ్మదిగా రావాలని సూచించిగా ఇద్దరి మధ్య మాటా మాట పెరిగింది. దీంతో మధుకుమార్‌పై వెంకటేశ్వర్లు దాడి చేశాడు. బాధితుడు ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ చెప్పారు.

కల్తీ నూనె విక్రయాలను అరికట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో పలు ఆయిల్ డిపోలు కల్తీనూనెను విక్రయిస్తున్నాయని వాటిని అరికట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, రైతు సంఘ తాలుకా కార్యదర్శి జబ్బార్ కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆయిల్‌డిపోల వారు కల్తీనూనె విక్రయిస్తుండటంతో అమాయక ప్రజలు కొనుగోలు చేసి రోగాలు కొనితెచ్చుకొంటున్నారన్నారు. మల్లికార్జున గౌడ్,వీరేష, విజయేంద్ర, శాంతప్ప, ఖాజ, నరసింహులు, తిమ్మయ్య పాల్గొన్నారు.

వేలం వాయిదా

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథస్వామి దేవాలయంలో తలనీలాలు వేలాలు మరోసారి వాయిదా పడ్డాయని ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ బుధవారం తెలిపారు. గతేడాది రూ.16 లక్షలకు వేలం దక్కించుకున్న పాటదారులు కేవలం రూ.10 లక్షల లోపు వేలం పాడుతుండడంతో అధికారులు నాల్గోసారి వేలం పాటలరె వాయిదా వేశారు. పాటదారులు సిండికేట్‌గా మారి తక్కువకు దక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. గతంలో మూడుసార్లు నిర్వహించినా సరైన పాట రాకపోవడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేశామన్నారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా

ఆలూరు: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా టెట్రా ప్యాకెట్లను తరలిస్తున్న వారిపై ప్రత్యేకంగా నిఘా వేసి చర్యలు తీసుకుంటామని ఆలూరు సెబ్ సీఐ ఎర్రవెంకట్ తెలిపారు. హాలహర్వి, గూళ్యం, బాపురం గ్రామాల్లో నాటుసారా, కర్ణాటక టెట్రా ప్యాకెట్లను రవాణాదారులపై సిబ్బందితో బుధవారం విచారణ చేయించారు. అనంతరం స్థానిక సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హొళగుంద, ఆస్పరి, మండల కేంద్రాలకు సమీపంలో అక్రమ మద్యం సరఫరాదారులపై దృష్టి సారించామన్నారు. అలాగే వన్నూరు, మార్లమిడికి, గ్రామాల్లోని చెక్ పోస్టు అధికారులు సమాచారంతో దాడులు ముమ్మరం చేస్తామని చెప్పారు. ఎస్‌ఐ రాజశేఖర్, పోలీసులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మద్దికెర : స్థానిక బేతేలు ప్రార్థన ఆవరణలో ఆపద్బంధు సేవాసమితి, క్రిస్టియన్ అసెంబ్లీ ఆధ్వర్యంలో అనంతపురం కిమ్స్ హాస్పిటల్ వారు బుధవారం ఉచిత గుండె వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా శిబిరంలో 40 మంది రక్తదానం చేశారు. 145 మంది గుండె వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, సేవాసమితి అధ్యక్షుడు సునీల్‌కుమార్, దైవ సేవకులు ఆనంద్ మాట్లాడుతూ వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైతే ప్రభుత్వం కల్పించే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు.రాజశేఖర్, రాజు, మధు, గుండెవైద్య నిపుణులు రాంకుమార్ పాల్గొన్నారు.